ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY 5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

ఆదివారం 7 సెప్టెంబరు 2025



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అనగాని, వేదికపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు

సంక్షేమం.. అభివృద్ధి డబుల్

వెంటిలేటర్‌పై నుంచి సాధారణ స్థితికి రాష్ట్రం

పథకాలు, పాలసీలపై వైసీపీ చిల్లర రాజకీయం

మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్

10న జరిగే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభపై సమీక్ష

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పైకి తెచ్చిందని, కూటమి ప్రభుత్వం తిరిగి సామాన్య స్థితికి తీసుకొచ్చిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 10వ తేదీ జరిగే 'సూపర్ సిక్స్- సూపర్‌హిట్' బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నారాయణ, రవికుమార్, కొల్లు రవీంద్ర, సవిత, రాంప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభ జరిగే ప్రాంతానికి మంత్రులు చేరుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో సుమారు గంటపాటు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్థిక లోటుతో ఉన్న రాష్ట్రాన్ని కేంద్రం సహకారంతో గాడిలో పెడుతున్నామని పయ్యావుల అన్నారు. డబుల్ సంక్షేమం, డబుల్ అభివృద్ధి అందించే స్థితికి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.3 వేలు పింఛన్ ఇస్తే తాము రూ.4 వేలు చేశామని, వారు 42 లక్షల మందికి పింఛన్లు ఇస్తే.. తాము 64 లక్షల మందికి ఇస్తున్నామని అన్నారు. రైతు భరోసా రూ.7 వేలు ఇస్తే తాము అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తున్నామని తెలిపారు. పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని అన్నారు. గత నెల 15న ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ.... పండుగ రోజుల్లో దీపావళి డబుల్ ధామాకా జరుపుకుంటారని అన్నారని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారం జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సామాన్యు తీసుకునే వస్తులపై జీఎస్టీ తగ్గించారని, కొన్నింటికీ పూర్తిగా ఎత్తివేశారని అన్నారు. ప్రధాని సాహసోపేత నిర్ణయాలకు సీఎం చంద్రబాబు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అద్భుతమైన కార్యక్రమాలు తీసుకొచ్చిందని మంత్రి అనగాని అన్నారు. ఈ పథకాలు, పాలసీల గురించి

(మిగతా 6వ పేజీలో...)

బ్యాంకు దొంగ అరెస్టు

- రూ.2 కోట్ల విలువైన బంగారం స్వాధీనం
- నిందితుడు మాజీ బీఎస్ఎఫ్ జవాను
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న

7



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

నేడు చంద్రగ్రహణం

- ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఆలయాలు

6



లేపాక్షిలోని దుర్గా వీరభద్రస్వామి ఆలయం

పండగ ఖర్చు రూ.150కోట్లు !

జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణేష్ చతుర్థి

- రెండువేల విగ్రహాలకు పైగా ఏర్పాటు
- ఉపాధి పొందిన వివిధ వర్గాలు
- ఒక్కో మండపం వద్ద లక్షల్లోనే ఖర్చు

హిందూపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలకు రూ.150కోట్లు ఖర్చు అయినట్లు అంచనా. హైందవ సంస్కృతి ఉట్టిపడేలా చవితి రోజు నుంచి నిమజ్జనం వరకు భక్తులు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. భారీ విగ్రహాలు, మండపాల ఏర్పాటు, విద్యుత్ దీపాలతో అలంకరణలు, పూలు, పండ్లు , నైవేద్యాల సమర్పణలు, అన్నదానాలు ఇలా ఒక టేమిటి నవరాత్రుల్లో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఖర్చుకు వెనుకాడకుండా నిర్వహించారు. వివిధ గ్రామాల్లో భక్తులు శక్తి కొలది గణపయ్యను పూజించారు.

నెలరోజులపాటు పలు రంగాలకు ఉపాధి

వినాయక చవితి అంటేనే అందరిలోనే ఓ రకమైన ఆనందం. పండుగ సంబరం నెలరోజుల ముందే మొదలవుతుంది. అనేక వ్యాపారాలకు ఈ చవితి ఓ వేడుక. కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతుంది. భారీ విగ్రహాల తయారీని సాధారణంగా నెలరోజుల ముందు నుంచే ప్రారంభిస్తారు. పదడుగుల విగ్రహం మట్టితో చేయాలంటే నెలరోజులు పడుతుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విగ్రహ తయారీదారులు మండపాలవద్దే వినాయక ప్రతిమలను సిద్ధం చేశారు. మరి కొంతమంది వినాయక చవితికి రెండు నెలల ముందుగా పట్టణాలకు వచ్చి ఇక్కడే స్థలాలు, గోడౌన్‌లు లీజుకు తీసుకుని విగ్రహాలను తయారుచేయించి విక్రయించారు. విగ్రహాల తరువాత మండప నిర్వాహకులు అధిక ప్రాధాన్యం ఇచ్చేది అలంకరణకే చవితి వేడుకల నేపథ్యంలో అలంకరణ, విద్యుత్ దీపాలు, బ్యాండు, లౌడ్ స్పీకర్లు, ప్రసాదాల తయారీ, వేదిక ఏర్పాటుకు సెంట్రింగ్ పనివారు, పూల దుకాణాలు, కిరాణా దుకాణాలు, కూరగాయల వ్యాపారులు అధికంగా లబ్ధి పొందుతారు. ఈ లెక్కన పండుగ సందర్భంగా హిందూపురం పట్టణంలోనే రూ.50కోట్ల లావాదేవీలు జరిగినట్లు అంచనా.

రూ.5లక్షల నుంచి రూ.15లక్షలు ఖర్చు

ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా చిన్న, పెద్ద విగ్రహాలు 2వేల దాకా ఏర్పాటు చేసినట్లు అంచనా. చిన్నపాటి విగ్రహం అయినా కనీసం రూ.20వేలు పెట్టాల్సిందే. హిందూపురంలో దాదాపు వంద విగ్రహాలు సుమారు రూ.1.5లక్షల నుంచి రూ.3లక్షల వరకు వెచ్చించి తయారు చేయించారు. ఒక్కో మండపం ఏర్పాటు చేసుకోవడానికి రూ.లక్ష ఖర్చయింది. ఇక విగ్రహం ఉంచడానికి పదిరోజులపాటు ట్రాక్టర్ ట్రాలీ బాడుగ రూ.20వేలు. ఒక్కరోజు పూజాసామగ్రి ఖర్చు కొన్ని విగ్రహాల వద్ద రూ.5వేల నుంచి రూ.20వేల దాకా వచ్చింది. మరికొన్ని విగ్రహాలకు రూ.50నుంచి రూ.లక్ష దాకా ఖర్చుచేశారు. పురంలో కొన్ని విగ్రహాలకు బెంగళూరు నుంచి ప్రతిరోజూ ప్రత్యేకంగా పూలహారాలు తెప్పించారు. ఇందుకోసం రోజుకు రూ.70వేల దాకా ఖర్చు పెట్టారు. ఇక పూజారులకు తొమ్మిది రోజులకు రూ.15వేలతో మొదలుకుని రూ.50వేల దాకా ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.50వేల నుంచి రూ.5లక్షలదాకా ఖర్చుపెట్టారు. వేదిక మండపం, పరిసరాల అలంకరణ, విద్యుత్ దీపాలు, లౌడ్ స్పీకర్లు తొమ్మిది రోజులకు గాను రూ.2లక్షలు ఖర్చుపెట్టారు. కొన్ని మండపాల వద్ద అన్నదానానికి రోజుకు రూ.20వేల నుంచి రూ.30వేలు ఖర్చుపెట్టారు. డీజేలకు భారీ ఎత్తున ఖర్చుపెట్టారు. హిందూపురానికి వచ్చిన సుమారు 50డీజేలకు ఒక్కోదానికి రూ.2లక్షల నుంచి రూ.5లక్షలు చెల్లించారు. ఇక ఆ వాహనాలు రానుపోను ఖర్చు, బాడుగలు కూడా విగ్రహ కమిటీవారే భరించాలి. జిల్లాలో 2వేల విగ్రహాలు ఏర్పాటుచేయగా అందులో వెయ్యికిపైగా పెద్ద విగ్రహాలే ఉన్నాయి. ఈలెక్కన విగ్రహ నిమజ్జనం పూర్తయ్యేసరికి రూ.5లక్షల నుంచి రూ.15లక్షలు ఖర్చయింది. అయితే మరికొన్నింటికి రూ.20 లక్షల నుంచి రూ.30లక్షలు కూడా ఖర్చయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ లెక్కన జిల్లాలో వినాయకుడి పండుగ ఖర్చు రూ.150కోట్లు దాటి ఉంటుందని అంచనా వేస్తున్నారు.



రొద్దంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

రోగులకు మెరుగైన వైద్యం

- పరిశుభ్రత, పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్



ఆసుపత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

హిందూపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని, రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, పనిచేయకపోయినా తొలగించి కొత్తవారిని నియమించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారని, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు అందించే సదుపాయాలు బోర్డులో అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన అన్నిమందులు నిలువ ఉంచాలన్నారు. రక్తనిధి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఓపీ చీటీల విభాగాన్ని ప్రారంభించిన కలెక్టర్

సీజనల్ వ్యాధుల కారణంగా ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగా ఓపీ ఉండాలనే ఉద్దేశ్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో పరిశీలించి పారిశుధ్యం, ట్రాఫిక్‌పై సూచనలు ఇచ్చారు. ఎంజీఎం క్రీడా మైదానాన్ని పరిశీలించి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం, ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యాసాగర్, శ్రీదేవి, బాలాజీ, శ్రీనివాస్‌నాయుడు, మధుసుధన్ పాల్గొన్నారు.

సూపర్ హిట్ సభకు 3500 బస్సులు

- ఆర్టీసీ అధికారులతో మంత్రుల సమీక్ష (6లో)

భార్యను హత్య చేసిన భర్త

(6లో)

వృద్ధాప్యంలో భరోసా !

- వృద్ధులకు ఆసరాగా పీఎం కిసాన్ మాన్‌ధన్
- ప్రీమియం కడితే 60 ఏళ్లు దాటాక పింఛను

(6లో...)

పనులు చేసినా పస్తులు..!

- 13 వారాలుగా జమకాని బిల్లులు
- జిల్లాలో రూ.78 కోట్ల బకాయిలు
- కార్యాలయాల చుట్టూ ఉపాధి కూలీల ప్రదక్షిణ

మడకశిర, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు బిల్లులు రాకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. పనులు చేసి 13 వారాలు దాటుతున్నా బిల్లులు జమకాక పోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన 60వేల మంది కూలీలకు రూ.78 కోట్లు దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో రెండు లక్షల మందికి పైగా జాబ్‌కార్డులు ఉన్నాయి. పనులు చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఎండా కాలంలో ఎండకు ఎండాల్సిందేనని, వర్షాకాలంలో వానకు తడావాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు. వర్షాలు పడుతుండడంతో పనులు చేసేందుకు అనుకూలంగా ఉన్నా.. బిల్లులు రాకపోవడంతో తమకు జీవనం గడవడం కష్టంగా మారిందని అంటున్నారు. అప్పులు పుట్టడం కూడా కష్టంగా ఉందని వాపోతున్నారు. పనులు చేసినా సకాలంలో బిల్లు అందక పోవడంతో పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగా నే ఉన్నాయని, విధిలేని పరిస్థితులో ఇతర ప్రాంతాలకు పనులకు వెళ్లక తప్పలేదని అంటున్నారు. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో వారానికి బిల్లులు ఖతాల్లోకి జమఅయ్యేవని, ప్రస్తుతం 13 వారాలు గడుస్తున్నా జమకావడం లేదన్నారు. మడకశిర నియోజకవర్గంలో సాగు నీటి వనరులు, పరిశ్రమలు లేక పోవడంతో కూలీలు ఉపాధి హామీ పథకంపైనే ఎక్కువగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. స్థానింగా వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. మడకశిర నియోజకర్గంలోనే రూ.11కోట్ల దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది.



ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు

కూలి డబ్బులు జమ కాలేదు



ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసినా సకాలంలో బిల్లులు రావడంలేదు. పనులు చేసి 13 వారాలవుతున్నా కూలి డబ్బులు ఖాతాలోకి జమకాలేదు. ఇంతకు మునుపు వారానికి, రెండు వారాలకు బిల్లులు ఖాతాలోకి జమ చేసే వారు. పనులు చేసే చోట కనీస వసతులు కల్పించడం లేదు. ఎండాకాలంలో ఎండలో, వర్షాకాలం వానతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాలి. - శంకర్, హెచ్‌టీ హళ్లి

రూ.78 కోట్లు చెల్లించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు 13 వారాలకు సంబంధించి రూ.78 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వారం రోజుల్లో ఉపాధి హామీ ద్వారా పనులు చేసిన కూలీలకు బిల్లులు వారి ఖాతాల లోకి జమ అవుతాయి.

- విజయేంద్రప్రసాద్, పీడీ, డ్వామా

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం



స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు

కదిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్తులతో శనివారం కిటకిటలాడింది.. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శంచుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయా నికి చేరుకున్నారు. దీంతో ఆలయ సమీప ప్రాంతాల్లో సందడి నెలకొంది.

నేడు చంద్ర గ్రహణం

ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఆలయాలు

న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలన్నీ ఆదివారం మధ్యాహ్నం నుంచే మూతపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 9.50 గంటలకు గ్రహణ స్పర్శకాలం, 10.58 గంటలకు ఉన్మీలన కాలం, 11.41 గంటలకు నిమీలన కాలం, రాత్రి 1.31 గంటలకు గ్రహణ మోక్ష కాలం, 8న తెల్లవారుజామున 3.41 గంటలకు ఆద్యంత పుణ్యకాలంతో గ్రహణం వీడనుంది. ఈ నేపథ్యంలో కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు, బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయం, లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయం, కసాపురం ఆంజనేయస్వామి ఆలయం, మురడి ఆంజనేయస్వామి ఆలయాలను మూసివేయనున్నట్లు ఆయా ఆలయాల అధికారులు, అర్చకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1గంట నుంచి మూసి వేసి, సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, పూజల అనంతరం భక్తులకు దైవ దర్శనం చేయించనున్నట్లు అధికారులు తెలిపారు.




హుండీ సొమ్మును లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

హుండీ ఆదాయం రూ.33.75 లక్షలు

ఉరవకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. కర్నూలు జేవీవీ కార్యాలయం అధికారి మాధవస్వామి, ఆలయ ఇన్‌చార్జి ఈవో తిరుమల రెడ్డి పర్యవేక్షణలో హుండీలను తెరచి సొమ్మును లెక్కించారు. 110రోజులకు రూ.33,75,028లుఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే 12గ్రాములు బంగారం, 697గ్రాములు వెండి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా శాఖలో ఉపకార వేతనాలు

- 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- దరఖాస్తుకు ఈనెల 16 వరకూ గడువు



దీన్ దయాళ్ యోజన ఉపకార వేతన వివరాల కరపత్రిక

ఉరవకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థుల్లో సృజనాత్మకత, జిజ్ఞాసను పెంపొందించేందుకు తపాల శాఖ దీన్ దయాళ్ స్పర్శ యోజనా పేరిట పోటీ పరీక్షలు నిర్వహిస్తోంది. చరిత్ర, క్రీడలు, విజ్ఞానం, సమకాలీన అంశాలు, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశ్యం. తపాల బిళ్లల సేకరణ, అధ్యయనంతో కలిగే ప్రయోజనాలు వివరించేందుకే ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఉపకార వేతనాల పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని చెబుతున్నారు. వివరాలకు అనంతపురం ప్రధాన తపాల కార్యాలయంలో సంప్రదించాలని సూచిస్తున్నారు.

రెండు దశల్లో ఎంపిక

మొదట స్ర్కీనింగ్ పరీక్ష ఉంటుంది. దీనిలో జనరల్ నాలెడ్జ్, స్టాంపులు, వర్తమాన అంశాల నుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులు రెండో దశలో ప్రాజెక్టు వర్క్ చేయాలి. ఇందులో జంతువులు, పక్షులు, ప్రదేశాలు, పూలు, సంగీతం విభాగాల్లో ఒక అంశాన్ని ఎంచుకుని ప్రాజెక్టు వర్క్ పూర్తి చేయాలి. పూర్తయిన ప్రాజెక్టును విజయవాడ తపాల శాఖ సర్కిల్ కార్యాలయానికి పంపాలి.

దరఖాస్తుల స్వీకరణ

విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా ఈ నెల 16వ తేదీ లోపు అనంతపురంలోని తపాల శాఖ ప్రాంతీయ కార్యాలయానికి దరఖాస్తులు పంపాలి. తపాల శాఖలో రూ.200 చెల్లించి, విద్యార్థి పేరుతో లేదా ప్రధానోపాధ్యాయుడి పేరుమీద ఫిలాటలి ఖాతా, ఫిలాటలి క్లబ్ ఖాతా తెరవాలి. ఖాతా తెరవగానే రూ.180 విలువ చేసే తపాల బిళ్లలు ఇస్తారు. ఇవి పోటీ పరీక్షలు రాసే వారికి ఉపయోగపడతాయి. పరీక్ష తేదీని తపాల శాఖ వారు హెచ్ఎంలకు తెలియజేస్తారు.

ప్రతి నెలా రూ.500 పొందవచ్చు

రెండు దశల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విజయవాడ తపాల శాఖ సర్కిల్ కార్యాలయం అధికారులు ఎంపిక చేస్తారు. వీరికి ప్రతినెలా రూ.500 చొప్పున, ఏడాదికి రూ.6వేలు ఉపకారవేతనం అందిస్తారు. ఈ సాయం పొందేందుకు విద్యార్థులు తమ పేరు, తల్లిదండ్రుల పేరుతో తపాల శాఖలో జాయింట్ సేవింగ్ ఖాతాను తెరవాల్సి ఉంటుంది.

మళ్లీ వెరిఫికేషన్

- డీఎస్సీ-2025లో బోగస్‌ల నివారణకు చర్యలు
- రేపు ఇతర జిల్లా బృందాలతో పరిశీలన

అనంతపురం విద్య, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025కు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు సమాచారం. గత నెల 28, 29న కమిటీ బృందాలు 770మంది సెలెక్టెడ్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆరోపణలు వస్తుండటంతో వాటిని మళ్లీ పరిశీలించాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో ఈనెల 4న రీవెరిఫికేషన్ చేయించారు. అప్పుడు కూడా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అనేక రిమార్క్‌లు వచ్చాయి. అనంతపురం జిల్లా నుంచి కూడా ఆరుగురు అభ్యర్థుల ఎంపిక సమాచారాలపై రిమార్కులు వచ్చాయి. వీటిపై రాష్ట్ర కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కొన్నిజిల్లాల డీఈఓలకు షోకాజ్‌లు, చార్జ్‌మెమోలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే ముందుగా పరిశీలించిన బృందసభ్యులతో కాకుండా మరో కమిటీతో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించాలని ఆదేశించారు. దీంతో ఈనెల 5న జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రీ వెరిఫికేషన్ చేయించారు. అపుడు కూడా అనేక రిమార్కులు బయటపడ్డాయట.



సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేస్తున్న కమిటీ బృందం

అనంతపురం జిల్లాలో కూడా మరో ఐదుగురు అభ్యర్థుల సమాచారంలో రిమార్కులు బయటపడ్డాయని విద్యాశాఖ యంత్రాంగం వెల్లడించింది. ఓ జిల్లాలో కమిటీలో ఉన్న ఓ ఎంఈఓ ముందస్తుగా డబ్బులు మాట్లాడుకొని బోగస్‌లకు అండగా నిలిచి, తప్పుడు సర్టిఫికెట్లు పెట్టినా, అన్నీ సక్రమంగా ఉన్నట్లు పరిశీలన చేసి అప్‌లోడ్ చేసి పంపారట. అయితే ఆధారాలతో దొరకిపోవడంతో ఆ ఎంఈఓను సర్వీస్ నుంచి తొలగించేందుకు కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ఇతర జిల్లా బృందాలతో ..

ఇప్పటివరకు జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశీలన బృందాలతోనే డీఎస్సీ అభ్యర్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. జిల్లాలో పలువురు నకిలీల వ్యవహారాలు, డ్రామాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్, పీహెచ్, స్టడీ, కుల సర్టిఫికెట్లపై విమర్శలు రావడంతో దాదాపు 20కి పైగా అభ్యర్థులను పెండింగ్ పెట్టారు. కొందరిని రిజెక్ట్ చేసి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించారు. ఇంకా కొందరి సర్టిఫికెట్ల పై రెవెన్యూ, ఇతర శాఖల నుంచి స్పష్టత రావాల్సిఉంది. ఈ నేపథ్యంలో ఇతర జిల్లా బృందాలతో అభ్యర్థుల సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. సోమవారం ఇతర జిల్లా కమిటీలు అనంతపురం జిల్లాకు వచ్చే అవకాశం ఉందని, వారిద్వారా మళ్లీ సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. దీంతో అభ్యర్థుల కన్నా విద్యాశాఖ అధికారులు, సిబ్బందే ఎక్కువగా టెన్షన్ పడుతున్నారు.

అనంత కవులకు పురస్కారాలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవులు ఏలూరు యంగన్న, ఒంటెద్దు రామలింగారెడ్డి.. జోళదరాసి చంద్రశేఖరరెడ్డి స్మారక పురస్కారాలను అందుకున్నారు. బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరిని పురస్కారాలకు ఎంపిక చేశారు. బళ్లారిలోని బసవ రాజేశ్వరి విద్యాలయం ఆవరణలో శనివారం సాయంత్రం పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శీలా బ్రహ్మయ్య, సాహితీ ప్రముఖులు వీరికి పురస్కారాలను అందజేసి సత్కరించారు.

ఉద్యోగ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ, ఏఎస్ఐలను సత్కరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించి, ఉద్యోగ విరమణ చేసినవారిని ఎస్పీ రత్న ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు కళావతి, శ్రీరాములు, ఏఎస్ఐలు మస్తాన్, వెంకట్రాముడును జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆమె సత్కరించారు. ప్రతి ఉద్యోగికీ విరమణ సాధారణమని, విధులలో ప్రజలకు అందించే సేవలే శాశ్వతమని అన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

వృద్ధాప్యంలో భరోసా !

- వృద్ధులకు ఆసరాగా పీఎం కిసాన్ మాన్‌ధన్
- ప్రీమియం కడితే 60 ఏళ్లు దాటాక పింఛను



కదిరి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో జీవనోపాధి లేని, ఖర్చులు భరించడానికి కనీస పొదుపు లేని చిన్న, సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్‌తో పింఛన్ యోజన అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా 60 ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు రైతులకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున జీవిత కాలం పింఛను అందుతుంది. ఈ పథకంలో చేరడానికి 40 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులు. ఐదెకరాల్లోపు సొంత వ్యవసాయ భూమి గల సన్నకారు, పీఎం కిసాన్ లబ్ధిదారులు వివరాలు నమోదు చేసుకోవచ్చు. పన్ను చెల్లింపుదారులు, సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్న వారికి వర్తించదు.

ప్రీమియం ఇలా...

18 నుంచి 40 ఏళ్ల వయసున్న రైతులు ప్రతి నెలా రూ. 55 చెల్లిస్తే కేంద్రం తన వాటాగా మరో రూ. 55 కలిపి మొత్తం రూ. 110 జమ చేస్తుంది. 21 ఏళ్ల వారు రూ.61, 25 ఏళ్ల వారు రూ.80, 30 సంవత్సరాల వారు రూ.106, 35 ఏళ్లకు రూ.150, 40 ఏళ్ల వారు రూ. 200 ప్రీమియం చెల్లించాలి. 60 ఏళ్ల తరువాత ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ లభిస్తుంది. ఆ రైతు మరణిస్తే నామినీగా ఉన్న వారికి ప్రతి నెలా రూ. 1500 పింఛన్ జీవిత కాలం అందుతుంది.

దరఖాస్తు ఇలా

పీఎం కిసాన్ లబ్ధిదారులు సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేయించాలి. మొదట ఆధార్, తర్వాత నామినీ వివరాలు దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం పింఛన్ కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం చెల్లించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు వృద్ధాప్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. మీసేవ కేంద్రాల్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- శ్రీహరి నాయక్, ఏఓ, కదిరి

సూపర్ హిట్ సభకు 3500 బస్సులు

- ఆర్టీసీ అధికారులతో మంత్రుల సమీక్ష



బస్సుల ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10న నిర్వహించే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభను విజయవంతం చేసేందుకు సమిష్టి కృషి చేద్దామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. అనంతపురం బస్టాండు ఆవరణలో వీరు శనివారం సాయంత్రం పర్యటించారు. అనంతరం ఆర్ఎం కార్యాలయంలో సమావేశమై, ముఖ్యమంత్రి సభకు బస్సుల సమీకరణ గురించి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,500 బస్సులను ముఖ్యమంత్రి సభకు కేటాయించేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రులు తెలిపారు. ప్రయాణికులకు ఎక్కడా అసౌకర్యం కలగకూడదని, అవసరమైతే ఇతర జిల్లాల్లో అదనంగా ఉన్న బస్సులను సర్దుబాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా ఆర్ఎం మధుసూదన్, అనంతపురం జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎం శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎంఈ రమేష్ బాబు, డీఎంలు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు



అనంతపురంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 699 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఉండమ్మా.. బొట్టు పెడతాం..!

సూపర్ హిట్ సభకు తెలుగు మహిళల ఆహ్వానం



బొట్టు పెడుతున్న మాజీ మేయర్ స్వరూప, ఇతర నేతలు



బొట్టు పెడుతున్న స్వప్న, తేజశ్విని ఇతర నేతలు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10న నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు రావాలని కోరుతూ నగరంలోని మహిళలను తెలుగు మహిళలు శనివారం ఆహ్వానించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ మహిళలకు పసుపు రాసి, కుంకుమ బొట్టు పెట్టి మరీ ఆహ్వానిస్తున్నారు. స్థానిక ఆలయాల్లో శనివారం పూజలు నిర్వహించి, ఇంటింటికీ వెళ్లారు. వీరశైవ లింగాయత కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగు మహిళ నాయకురాలు వడ్డే భవాని, రాష్ట్ర రజక సాధికార కమిటీ సభ్యులు శోభ, తెలుగు మహిళ జిల్లా ప్రచార కార్యదర్శి కంఠా దేవి, కార్యదర్శి మహేశ్వరి తదితరులు రజక నగర్‌లోని వినాయకుడి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం 48, 42, 41 డివిజన్‌లలోని రజకనగర్, జనశక్తి నగర్, 6వ రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగారు. సీఎం సభకు రావాలని ఆహ్వానించారు. మాజీ మేయర్ స్వరూప ఆధ్వర్యంలో 45వ డివిజన్‌లో అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు దళవాయి రమాదేవి, మాజీ కార్పొరేటర్లు సరళ, భూలక్ష్మి, తెలుగు మహిళలు చరిత, రమాదేవి, రంగమ్మ, రాణి, వనజ, ఈశ్వరమ్మ తదితరులు ఇంటింటికీ తిరిగారు. ముఖ్యమంత్రి సభకు రావాలని ఆహ్వానించారు.

భార్యను హత్య చేసిన భర్త



మోహన్‌తాజ్ (ఫైల్)

గాండ్లపెంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భార్యను రోకలిబండతో కొట్టి చంపిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని తూపల్లి గ్రామానికి చెందిన మన్సూర్, మెహన్‌తాజ్‌కు (30) 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి 12 సంవత్సరాల కుమారుడు నిహార్, 10 సంవత్సరాల కుమార్తె మినహా ఉన్నారు. పిల్లలతో కలిసి మోహన్‌తాజ్ శుక్రవారం దుస్తుల కోసం మదనపల్లికి వెళ్లి, తిరిగి రాత్రి 9గంటలకు స్వగ్రామానికి చేరుకున్నారు. దీనిపై మన్సూర్ తన భార్య మెహన్‌తాజ్‌తో గొడవపడ్డాడు. అందరూ పడుకున్న తర్వాత అర్ధరాత్రి సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న భార్య మెహన్‌తాజ్ తలపై రోకలిబండతో మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా తెలిపారు. మృతదేహాన్ని కదిరి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మన్సూర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

9 మంది ఎంపీడీఓలకు ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో 9 మంది ఎంపీడీఓలకు డీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారికి ప్లేస్‌మెంట్స్ ఖరారు చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగి పేరు	ఎంపీడీఓ ప్రస్తుత స్థానం	డీడీఓగా పోస్టింగ్ స్థానం
శివానందనాయక్	ఏపీడీ మడకశిర	ఏపీడీ హిందూపురం
శకీలా భేగం	శింగనమల	డీపీఓ డ్వామా కర్నూలు
వెంకటరామిరెడ్డి	గాండ్లపెంట	ఏఓ డ్వామా, కడప
రఘునాథగుప్తా	నల్లచెరువు	ఏఓ డ్వామా నెల్లూరు
ఆజాద్	అమడగూరు	ఏపీడీ డ్వామా కమలాపురం
సరస్వతి	హిందూపురం	ఏఓ డ్వామా, కడప
రామక్రిష్ణ	గుమ్మఘట్ట	ఏఓ డ్వామా అనంతపురం
నరేంద్రకుమార్	గోరంట్ల	ఏపీడీ డ్వామా, నంద్యాల
శకుంతల	పెద్దపప్పూరు	ఏపీడీ డ్వామా, కదిరి



సమీక్షలో ప్రజా ప్రతినిధులు, నాయకులు

సంక్షేమం.. అభివృద్ధి డబుల్

(5వ పేజీ తరువాయి)

వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ దుకాణాలు, కార్యాలయాలు మూత పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, జోన్-5 కో-ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐఐసీ చైర్మన్ రాజు, ఎంపీలు పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర, బండారు శ్రావణిశ్రీ, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, అంజినప్ప, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, జనసేన నాయకులు చిలకం మధు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు

క్రైం కార్నర్

వృద్ధుడి ఆత్మహత్య

శెట్టూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన కురుబ ఈశ్వరప్ప (65) అనే వృద్ధుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. ఈశ్వరప్ప భార్య అంజినమ్మతో మనస్పర్థల కారణంగా 25 సంవత్సరాల నుంచి వేరుగా వుంటున్నారు. భార్య పుట్టినింట్లో పిల్లలతో కలసి ఉంటోంది. శుక్రవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు పోయి తిరిగి రాలేదు. శనివారం ఉదయం అతడి అన్న కోడలు జ్యోతి తన పొలంలోకి పోతుండగా ఈశ్వరప్ప చింత చెట్టుకు తాడుతో ఉరివేసుకోవడాన్ని గుర్తించింది. వెంటనే బంధువులకు సమాచారం ఇచ్చింది. మృతుడి అన్న గోవిందప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి మృతి

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురం క్రాస్ సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి మృతి చెందినట్లు జీఆర్‌పీ పోలీసులు శనివారం తెలిపారు. పట్టాలమీద యువకుడు మృతిచెందినట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. గుర్తుపట్టలేనంతగా శరీరం ముక్కలయిందని, జేబులో ద్విచక్రవాహనం తాళాలు తప్ప ఏవీ లేవన్నారు. సుమారు 30 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎలాంటి ఆచూకీ దొరకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిస్తే ధర్మవరం జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

బంగారం ఆభరణాల చోరీ

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో ఆరుబయట నిద్రిస్తుండగా ఓ మహిళ మెడలో నుంచి బంగారు చైను, మంగళసూత్రాన్ని అపహరించారు. చోరీపై బాధితులు శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన లలితమ్మ, కుళ్లాయప్ప దంపతులు శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన సమయంలో లలితమ్మ మెడలో నుంచి బంగారు చైనును లాక్కెళ్లారు. నిద్ర నుంచి తేరుకున్న లలితమ్మ గట్టిగా కేకలు వేసింది. దీంతో ఇద్దరు దుండగులు పరుగులు తీసి ద్విచక్రవాహనంలో పరారయ్యారని పేర్కొన్నారు. బంగారు చైను, మంగళసూత్రం రెండు తులాల వరకు చోరీకి గురైనట్లు ఆమె ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాకీ పేరుతో బెదిరింపులు

- ఆగ్రహించిన వ్యాపారులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత



బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకున్న స్థానికులు (సర్కిల్‌లో వ్యక్తి)

యాడికి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారు... డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన రాయలచెరువులో చోటుచేసుకుంది. కడప జిల్లా రాయచోటికి చెందిన సయ్యద్ గౌస్‌బాషా శనివారం సాయంత్రం పలు దుకాణాల వద్దకు వెళ్లి డబ్బులు బాకీ వున్నారు, ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగాడు. పలు పెయింట్ షాపుల వద్దకు వెళ్లి బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆగ్రహించిన షాపు యజమానులు అతడికి దేహశుద్ధి చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామంటూ బెదిరించాడని వ్యాపారులు ఆరోపించారు. విషయం పోలీసులకు సమాచారం తెలపగా అతడిని అదుపులోకి తీసుకున్నారు.

తండ్రి హత్యకు ప్రతీకారం

- రౌడీషీటర్ లోకేంద్ర హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీకారంతోనే ధర్మవరంలో రౌడీషీటర్ లోకేంద్ర(26) హత్య జరిగినట్లు ఎస్పీ రత్న తెలిపారు. రెండు రోజుల కిందట లోకేంద్రను ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో హత్య చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న శనివారం తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అరెస్ట్ వివరాలను మీడియాకు ఆమె వెల్లడించారు. ఏడాది కిందట ఆటోబాడుగ వివాదంలో మద్యం మత్తులో ఉన్న లోకేంద్ర ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీనివాసులురెడ్డిని హత్య చేశాడు. దీనికి ప్రతీకారం తీర్చుకోవడానికి శ్రీనివాసులురెడ్డి కుమారుడు బాలకృష్ణారెడ్డి వేచి ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే తన స్నేహితులైన సయ్యద్ ఇలియాజ్, డేరంగుల అంజనేయులుతో కలిసి హత్యకు ప్రణాళిక రచించాడు. ఈక్రమంలోనే గత గురువారం సాయంత్రం ధర్మవరంలోని కొత్తపేట శ్రీనిధి మార్ట్ ఎదుట లోకేంద్ర తన తండ్రితో కలిసి చెల్లెలు ఇంటికి వెళ్తూ ఆగాడు. అప్పటికే లోకేంద్రను హత్య చేయడానికి కాచుకుని ఉన్న బాలకృష్ణారెడ్డి అతడి స్నేహితులు లోకేంద్రను అనుసరించారు. తండ్రి టీ తాగడానికి వెళ్లగా లోకేంద్ర తన స్నేహితుడితో కలిసి మోటారుసైకిల్‌పై కూర్చొన్నాడు. ఇదే అదనుగా బాలకృష్ణారెడ్డి తన స్నేహితులు సయ్యద్ ఇలియాజ్, డేరంగుల అంజనేయులతో కలిసి కారులో వేగంగా వచ్చి వెనుక నుంచి మోటారుసైకిల్‌ను ఢీకొట్టాడు. లోకేంద్ర మోటారుసైకిల్‌పై నుంచి కిందపడగానే బాలకృష్ణారెడ్డి, ఇలియాజ్ కొడవళ్లతో విచక్షణారహితంగా నరికి, చంపారు. అనంతరం నిందితులు వచ్చిన కారులోనే పరారయ్యారు. ఈ హత్య కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణం సీఐ రెడ్డెప్ప, ప్రత్యేక బృందం నిందితులను ఎన్ఎస్‌గేట్‌కు వెళ్లే మార్గంలో శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి కారు, రెండు కొడవళ్లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ : కలెక్టర్

- అక్రమంగా నిల్వ చేస్తే కేసులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులందరికి అవసరమైన యూరియా, ఎరువుల పంపిణీలో సంబంధిత అధికారులు పారదర్శకత పాటించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా యూరియా మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి అధికారులందరూ నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో యూరియా నిలువలు, పంపిణీలో ఆర్డీవోలు, వ్యవసాయాధికారుల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు వ్యవసాయ శాఖ నుంచి వచ్చే డేటా ఆధారంగా రోజుకు ఎంత యూరియా అవసరం అవుతుందో అంచనావేయాలని తెలిపారు. వారానికి అవసరమై యూరియా డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందుగానే ఇండెంట్ పంపాలన్నారు. జిల్లాలోని రైతు సేవాకేంద్రాలు, సహకార సంఘాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాలపై నిఘా ఉంచి, అక్రమ నిలువలు, వ్యవసాయేతర అవసరాలకు యూరియాను తరలిస్తే 6ఎ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి రామునాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గీతా, డీసీఓ క్రిష్ణానాయక్; జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

'నశా ముక్త్ యువ'పై సమావేశం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్‌పై కేంద్ర మంత్రి మన్సుక్ మాండవీయా వర్చువల్ ద్వారా మార్గదర్శనం చేసినట్లు ఆ నలుగురు సేవా సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్ శనివారం పేర్కొన్నారు. వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ యువ కార్యకలాపాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ అనే స్వయం ప్రతిపత్తి సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా 123 ఆధ్యాత్మిక సంస్థలతో కలిసి సెప్టెంబరు 21న నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్‌పై సమ్మిట్ శ్రేణి నిర్వహిస్తారన్నారు. యువతకు మాదకద్రవ్యాలరహిత జీవనశైలిపై అవగాహన పెంచడం, నశా ముక్త్ యువ ప్రతిజ్ఞ చేయించడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా ధ్యానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, నిపుణుల చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యువత పరస్పర సంభాషణలు ఉంటాయన్నారు.

9న నృత్య, క్రీడా పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి నృత్య, క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పట్నం శివప్రసాద్, ధనుంజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భరతనాట్యం, కూచిపూడి, జానపద గిరిజన సంప్రదాయ నృత్యాలలో పోటీలు ఉంటాయన్నారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రాలు, అసోసియేషన్ గుర్తింపు కార్డు, ఆయా నృత్య క్రీడల పాటలతో ఈనెల 8వ తేదీలోపు సెల్ నంబర్లు : 8328686059, 9515999243 ను సంప్రదించి పంపాలని తెలిపారు.

టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.8, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఐఈడీ సెక్టోరల్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరణ గడవు ఈనెల 10 వరకు పొడిగించినట్లు ఏపీసీ శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుపూజోత్సవం, ఇతర సెలవులు రావడంతో దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

9న పీవీకేకేలో ప్రాంగణ నియామకాలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 9న ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఎన్‌వీహెచ్ ఇండియా ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బి.టెక్, డిప్లొమా విద్యార్థులకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, ఆటోమొబైల్ విభాగాలకు చెందిన 2020 నుంచి 2025 వరకు పాస్ అవుట్ అయిన పురుష అభ్యర్థులు అర్హులు అన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.2 లక్షల వేతనంతో పాటు బోనస్ కూడా ఇస్తారని వివరించారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, డిప్లొమా ఇంజనీర్ ట్రైనీగా పెనుకొండ సమీపంలోని అమ్మవారిపల్లి దగ్గర ఉన్న సంస్థలో నియమిస్తారని అన్నారు.

రేపటి నుంచి ఇన్‌స్పైర్ ఓరియంటేషన్ తరగతులు

కొత్తచెరువు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వతేదీ నుంచి ఇన్‌స్పైర్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఇన్ స్పైర్ మానాక్, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నామినేషన్‌లను స్వీకరిస్తామని అన్నారు. దీనిపై ఉపాధ్యాయులకు పాఠశాలల వారీగా అవగాహన కార్యక్రమాల్ని 8,9 తేదీలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8న పెనుకొండ డివిజన్‌లోని చిన్మయ విద్యాలయం హిందూపురంలోనూ, మధ్యాహ్నం పుట్టపర్తి డివిజన్‌లోని కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో, 9న ధర్మవరం డివిజన్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలోనూ, మధ్యాహ్నం కదిరి డివిజన్‌లోని కదిరి బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

15 నుంచి రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో ఈనెల 15వతేదీ నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళలకు టైలరింగ్, జర్దోసి మగ్గంపై ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగిన 18-45 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, పేర్ల నమోదుకు సెల్ నంబరు : 9492583484ను సంప్రదించాలని సూచించారు.

9న ఫార్మా శిక్షణ, ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, స్వర్ణభారత్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న ఫార్మా శిక్షణ, ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, డిప్లొమా, బి.ఫార్మా, ఎమ్మెస్సీ, బి.టెక్ చదివిన 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని అన్నారు. ఫార్మా రంగంలో అత్యున్నత నైపుణ్య శిక్షణ కల్పించి, వివిధ ప్రముఖ ఫార్మా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. అభ్యర్థులు విద్యార్హత, జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డులతో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు : 8121717846ను సంప్రదించాలని కోరారు.

9న సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 9న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. 2011 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26వతేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు: 7989017210ను సంప్రదించాలని సూచించారు.

తాడిపత్రికి పెద్దారెడ్డి

- 16 నెలల తరువాత ప్రవేశం
- పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు



ఇంటి వద్ద పెద్దారెడ్డికి దిష్టి తీస్తున్న అభిమాని

తాడిపత్రి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య 16 నెలల తర్వాత మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం తాడిపత్రికి చేరారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ నాయకులను నియోజకవర్గం నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో మూడు నెలల తర్వాత ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రికి చేరుకున్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మాత్రం తాడిపత్రికి రానీయలేదు. పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆయన కింది స్థాయి నుంచి సుప్రీం కోర్టుదాకా వెళ్లాడు. కోర్టు ఆదేశాల మేరకు భారీ బందోబస్తు మధ్య శనివారం తాడిపత్రిలోని తన స్వగృహం చేరారు. పెద్దారెడ్డి రాకతో పట్టణంలో హై టెన్షన్ వాతావరణం ఏర్పడిం ది. జిల్లా ఎస్పీ ఉదయమే తాడిపత్రికి చేరుకుని భద్రతను సమీక్షించారు. ఆయన ఆదేశాల మేరకు గొడవలు సృష్టిస్తారనే అనుమానం ఉన్న చోటా మోటా నాయకులందరిని ముందుగా హౌస్ అరెస్ట్ చేశారు. పెద్దారెడ్డి మాట్లాడుతూ పోలీసులకు సహకరిస్తానని, తన పార్టీ నాయకులకు అండగా ఉంటానని తెలిపారు. తమ పార్టీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతానని తెలిపారు. కాగా జేసీ ప్రభాకర్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు తాడిపత్రిలో లేకపోవడం గమనార్హం.

బ్యాంకు దొంగ అరెస్టు

- రూ.2 కోట్ల విలువైన బంగారం స్వాధీనం
- నిందితుడు మాజీ బీఎస్ఎఫ్ జవాను
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూపురం రూరల్ మండలం తూముకుంట చెక్‌పోస్టు వద్ద ఎస్‌బీఐలో జరిగిన చోరీ కేసులో అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుడు అనిల్ కుమార్ పన్వార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతన్నుంచి రూ.2 కోట్ల విలువైన రెండు కేజీల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ రత్న తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్‌తో కలసి శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. హరియాణాలోని గుర్గావ్ జిల్లా మారుతికుంజ్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ పన్వార్ మాజీ బీఎస్ఎఫ్ జవాన్ అని, వ్యసనాలకు బానిసై, డబ్బు కోసం బ్యాంకు దోపిడీలకు పాల్పడుతున్నాడని ఎస్పీ తెలిపారు. జైలుకు వెళ్ళి వచ్చినా అతని తీరు మారలేదని, 2018లో అనంతపురం జేఎన్‌టీయూ సమీపంలోని స్టేట్ బ్యాంకులో జరిగిన దొంగతనం కేసులో నిందితుడని తెలిపారు. కోయంబత్తూరు సబ్ జైలులో 5 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించి, జూన్‌లో బయటకు వచ్చాడని, మరో వ్యక్తితో కలిసి జూలై 26న తూముకుంట చెక్‌పోస్టు సమీపంలోని స్టేట్ బ్యాంకులో చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. డీఐజీ షిమోషి ఆదే శాలతో డీఎస్పీ కేవీ మహేష్, హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ చంద్ర అంజినేయులు కేసును దర్యాప్తు చేశారని తెలిపారు. ఉమ్మడి జిల్లాతో పాటుగా చిత్తూరు, తిరుపతికి చెందిన 8 ప్రత్యేక బృందాలు 5 రాష్ట్రాలలో గాలింపు చర్యలు చేపట్టి, అనిల్ కుమార్ పన్వార్‌ను అరెస్టు చేశారని తెలిపారు. నిందితుడిని కస్టడీకి తీసుకుని విచారించామని, అతను చెప్పిన వివరాల ఆధారంగా 2 కేజీల బంగారం అభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన హోండా సిటీ కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై దేశంలోని పలు రాష్ట్రాల్లో 14 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. ముఠా సభ్యుడిని పట్టుకున్న డీఎస్పీ కేవీ మహేష్, సీఐలు ఆంజనేయులు, అబ్దుల్ కరీం, శేఖర్, జైపాల్ రెడ్డి, రాజ్‌కుమార్, జనార్దన్, ఉమ్మడి అనంతపురంజిల్లా, చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రత్యేక బృందాలను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులు ప్రశంసా పత్రాలను అందచేశారు.



దోపిడీకి ఉపయోగించిన కారు, బైక్, స్వాధీనం చేసుకున్న బంగారంతో పోలీసులు



మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, పక్కన ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

ప్రభుత్వం దృష్టికి ఓటీఎస్, రుణమాఫీ

- ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓటీఎస్, చేనేత సహకార సొసైటీల్లో రుణమాఫీ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి అధ్యక్షతన అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ చైర్మన్ మాట్లాడుతూ మొండిబకాయిల రికవరీకి వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)తో పాటు చేనేత సహకార సొసైటీల రుణమాఫీ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలకు ఆప్కాబ్ నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏడీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.650కోట్లు డిపాజిట్ల సేకరణ, రూ.2500కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి , డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవ్‌బాబు, విజయచంద్రారెడ్డి, సీనియర్ మేనేజర్లు అనంత పద్మనాభం, ఆర్‌వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యత పెంచిన అవార్డు

- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కోనంకి శ్రీధర్



సీఎం చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న డాక్టర్ శ్రీధర్

కళ్యాణదుర్గం/అనంతపురం విద్య, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తనపై బాధ్యత మరింత పెంచిందని అవార్డు గ్రహీత డాక్టర్ కోనంకి శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని ఎస్‌వీజీఎం డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకుడిగా, ఎన్ఎస్ఎస్ అధికారిగా పని చేస్తున్న శ్రీధర్ ఈ నెల 5న విజయవాడలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదివిన కళ్యాణదుర్గం డిగ్రీ కళాశాలలోనే అధ్యాపకుడిగా పని చేయడం అదృష్టమన్నారు. 13 ఏళ్ల అధ్యాపక వృత్తిలో 25 జాతీయ సెమినార్లకు హాజరై పేపర్ ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. 20 పరిశోధనలు, వ్యాసాలు, ఫండమెంటల్స్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ పుస్తకం రాసినట్లు తెలిపారు. గతంలో ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు అకడమిక్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తనకు లభించిన ఈ అవార్డును తనకు విద్యను బోధించిన గురువులందరికీ అంకితమిస్తున్నట్లు వెల్లడించారు.

12 నుంచి బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలు



ఎంపికైన బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా బాల బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి 10వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 12వ తేదీ నుంచి బత్తలపల్లి మండలం రామాపురంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా జూనియర్ బాల, బాలికల జట్లు వివరాలను శనివారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆయన ప్రకటించారు. జూనియర్ బాలుర విభాగంలో మదన్, జిలాన్, నిఖిల్, చిరంజీవి, రాజశేఖర్, హర్షవర్ధన్, అల్తాఫ్, సుధీర్, జగదీష్, ప్రదీప్, చందు, వినయ్, బాలాజీ ఎంపికయ్యారు. బాలికల జట్టులో వెంకటలక్ష్మి, గౌతమి, మానస, గౌతమిభాయి, అమృత, చరిత, మహేశ్వరి, మదీనా, కమలాక్షి, లోకేశ్వరిభాయి, విద్యారెడ్డి, సింధూజా, జశ్విత ఎంపికయ్యారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి పోటీలకు ఏర్పాట్లు చేశామని, క్రీడాకారులు సాధన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్‌మెద్దీన్, సభ్యులు బాషా, బాబా, నిర్వాహకులు చిన్నకేశవులు చౌదరి, ఉమాపతి, మోహన, వెంకట నారాయణ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

లక్ష్మీచెన్నకేశవపురంలో వీధిలైట్ల ఏర్పాటు

ధర్మవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్న కేశవపురం 25వ వార్డులో ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో శనివారం వీధి లైట్లు ఏర్పాటుచేశారు. వార్డులో ఉన్న విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై మున్సిపల్ అధికా రులు, ప్రజాప్రతినిధులకు ప్రజలు పలమార్లు విన్నవించారు. గత నెలలో నిర్వహించిన 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమంలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. ఆయన సూచన మేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధిరారులు స్పందించారు. దీంతో మున్సిపల్ సిబ్బంది ఆ వార్డులో వీధిలైట్లను ఏర్పాటుచేశారు.

అలరించిన పాటల కచేరి



పాటలు పాడుతున్న గాయకులు

పుట్టపర్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి మీడియా సెంటర్ సిబ్బంది చేపట్టిన భక్తిగీతాల ఆలాపన భక్తులను అలరింపజేసింది. మీడియా సెంటర్ 24వ వార్షికోత్సవం సందర్భంగా సాయికుల్వంతు మందిరంలో ప్రశాంతివాహిని పేరిట భక్తీగీతాలా పన చేశారు. గంట పాటు గాన కచేరితో భక్తులను అలరింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అయ్యప్ప గుడికి విరాళం

గాండ్లపెంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో చిన్నమిట్ట వద్ద నిర్మిస్తున్న అయ్యప్పస్వామి గుడికి ప్రముఖ వ్యాపార వేత్త నటరాజ్‌శెట్టి రూ. 1,25,116 చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. గతంలో ఇచ్చిన హామే మేరకు ముఖద్వారం నిర్మాణానికి తన భార్య దేవికిసునీతమ్మ జ్ఞాపకార్థం విరాళం అందించినట్లు ఆయన తెలిపారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనరసింహగౌడ్, వెంకటేశ్వర్లు, సాంబశివారెడ్డి, గంగయ్యాయాదవ్, హరి పాల్గొన్నారు.

తిమ్మమాంబ సమాఖ్య కమిటీ ఎంపిక

నంబులపూలకుంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తిమ్మమాంబ మండల సమాఖ్య కార్యాలయంఓ శనివారం 21వ ఆర్థిక మహాసభను పురస్కరించుకుని వార్షిక మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సమాఖ్య నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా మంగమ్మ, కార్యదర్శిగా అమృత, కోశాధికారిగా రమాదేవి, ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, ఉప కార్యదర్శిగా దేవిని ఎంపిక చేశారు. వారిని వీఒ లీడర్లు, పొదుపు సంఘాల మహిళలు సత్కరించారు. ఏపీఎం వెంకటనా రాయణ, సీసీలు బాబ్‌జాన్, ఇస్మాయిల్, రెడ్డెప్ప, శ్రీనివాసరావు, ఎల్‌సీ నరసింహులు, రామాంజులమ్మ, లక్ష్మీదేవి, తులసి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి వాసికి బళ్లారి రాఘవ అవార్డు



అంజనప్పను సత్కరిస్తున్న నిర్వాహకులు

బత్తలపల్లి, సెప్టంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన అంజనప్ప శనివారం బల్లారి రాఘవ అవార్డు అందుకున్నారు. తెనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఏర్పటు చేసి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని వందలాది మంది కళాకారులతో నాటక ప్రదర్శనలు ఇస్తూ, కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో బళ్ళారి రాఘవ కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ వారు తన సేవను గుర్తించి బళ్ళారి రాఘవ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు. బళ్లారి నగరంలోని బీపీఎస్ కళాశాల ఆడిటోరియంలో బళ్ళారి రాఘవ జాతీయ పురస్కరాలను బళ్ళారి రాఘవ మనవడు రఘునందన్, అనతపురం డిప్యూటీ కలెక్టర్ రఘునాథ్ చేతులమీదుగా శనివారం అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు బ్రహ్మయ్య, యశ్వంత్‌రాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

దిగుమతులపై సుంకాన్ని తగ్గించాలి

● సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుల నిరసన

ధర్మవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నియోజకవర్గ కార్యదర్శి పోలా లక్ష్మీనారాయణ, ఆర్ఎస్‌పీ నాయకుడు మంజులనరేంద్ర పేర్కొన్నారు. దిగుమతుల సుంకాన్ని తగ్గించాలంటూ వారు స్థానిక కళాజ్యోతిసర్కిల్‌లో శని వారం నిరసన వ్యక్తంచేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు నీలం శివప్రసాద్, సిరివెళ్ల, దేవేంద్ర, ఆర్ఎస్‌పీ నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు : సీడీపీఓ

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ గాయత్రి దేవి పేర్కొన్నారు. మండలంలోని కేజీబీవీలో శనివారం బాలికలకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బేటీ బచావో, బేటీ పఢావో అన్న పథకం కింద నవకల్ప కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కిశోరి బాలికలు రక్షణ కోసం 109, 108 నెంబర్లను గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమారి, ఎస్ఓ గీతాబాయి, ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లె కిశోర్ జన్మదిన వేడుకలు

కొత్తచెరువు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తనయుడు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి భర్త పల్లె కిశోర్‌రెడ్డి జన్మదిన వేడుకల ను శనివారం తన స్వగృహంలో ఘనంగా జరుపుకున్నారు. నూతనంగా వడ్డె కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన టీడీపీ టౌన్ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు నాయకులు, కార్యకర్తలతో కలిసి పల్లెకిశోర్‌రెడ్డితో కేక్‌కట్ చేయించారు.

● నల్లమాడ: బాలాజీ విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తనయుడు పల్లె వెంకట క్రిష్ణకిభోర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా టీడీపీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం మండలకేం ద్రంలోని స్వాతి క్లినిక్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం 30 పడకల ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. పెద్దకోట్లపల్లి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. నాయకులు మైలే శివశంకర్, బుట్టి నాగభూషణ నాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, కె. మంజునాథ్‌రెడ్డి, సలాంఖాన్, పూల రామయ్య, అబ్బాస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు అడ్డంగా బండలు, స్తంభాలు



రోడ్డుకు అడ్డంగా ఉన్న పెద్ద బండలు, విద్యుత్ స్తంభాలు

● లో ఓల్టేజీతో కాలిపోతున్న విద్యుత్ పరికరాలు
● డ్రైనేజీ కాలువలు లేక రోడ్డుపైనే మురుగునీరు
● సమస్యల్లో ప్రియాంకనగర్ వాసులు

ధర్మవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డు పరిధిలోని ప్రియాంకనగర్‌లో పలు సమస్యలు తిష్టవేశాయి. ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, లో ఓల్టేజీసమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అదేవిధంగా రోడ్డుకు అడ్డంగా పెద్దపెద్ద బండలు, రోడ్డు మధ్యలో విద్యుత్‌స్తంభాలు ఉన్నాయి. ఆ బండలను, విద్యుత్‌స్తంభాలను తొలగిస్తే రోడ్లు వేస్తామని మున్సిపల్ అధికారులు చెబు తున్నారు. వాటిని పక్కకు మార్చాలని సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విన్నవించి నా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా కొన్ని ఇళ్లపై విద్యుత్ లైన్‌లు వెళ్తున్నాయని వాటిని కూడా పక్కకు మార్చాలని చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని మండిపడుతున్నారు. అదేవిధంగా కొన్ని వీధులలో ఇనుప విద్యుత్‌స్తంభాలు ఉన్నాయని, వర్షాకాలంలో వాటికి విద్యుత్ సరఫరా అవుతోం దని అంటున్నారు. దీని వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళ వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, ఈ వార్డుకు నీరు సరఫరా చేసినప్పుడు అందరూ మోటార్లు వేస్తే కనీసం కొళాయిలకు నీరు ఎక్కడం లేదన్నారు. లోఓల్టేజ్ సమస్యతో టీవీలు, ఫ్రిడ్జ్‌లు, మిక్సీలు, వాషింగ్‌మిషన్‌లు కాలిపోతు న్నాయని మహిళలు వాపోయారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగు నీటిని రోడ్లపైకి పారవేస్తున్నారని, దీంతో మహిళలు గొడవలకు దిగుతున్నారన్నారు. ఈ సమస్యలపై 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి అర్జీల రూపంలో తెలిపామంటున్నారు. స్పందించిన ఆయన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారని చెబుతున్నారు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న బండలను తొలగిచండి



మా కాలనీలో రోడ్డుకు పెద్దపెద్ద బండలు అడ్డంగా ఉన్నాయి. వీటిని తొలగించాలని అధికారులకు పలుమార్లు విన్నవించాం. బండలను తొలగిస్తే తప్ప రోడ్డు వేయమని అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారన్నారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో బండల కింద నుంచి విషపురుగులు వస్తున్నాయి. దీంతో పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయంగా ఉంది. కావున అధికారులు తక్షణమే స్పందించాలి.

- నారపరెడ్డి, ప్రియాంకనగర్

లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించండి



మా కాలనీలో లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. మోటార్లు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మిషన్లు పనిచేయడం లేదు. కరెంటు ఉన్నా లేనట్టే. పైగా వర్షాకాలంలో లో ఓల్టేజ్ వల్ల బల్బులు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు తదితరాలు కాలిపోతున్నాయి. ఈ సమస్య ఐదేళ్ల నుంచి ఉంది. కావున సంబంధిత అధికారులు స్పందించి లో ఓల్టేజ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

- సాలమ్మ, ప్రియాంకనగర్

సమస్యలను పరిష్కరిస్తాం

మున్సిపాలిటీకి వచ్చిన డీఎల్ఆర్ఎస్, 15వ ఆర్థికసంఘం, ఎల్ఆర్ఎస్ కింద వచ్చిన నిధులన్నీ వైఎస్సార్ కాలనీ, కేతిరెడ్డి కాలనీ, ఇందిరమ్మకాలనీ, దుర్గానగర్ లో మౌలిక వసతులకోసం వెచ్చిస్తున్నాం. ప్రియాంకనగర్‌లో కేవలం కొత్తవీధిలైట్లు వేయిస్తున్నాం. నిధులు రాగానే ప్రియాంకనగర్‌కు మొదటి ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- వీరేశ్ కుమార్, డీఈ, మున్సిపాలిటీ

సీఎం సభను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

● తణుకు, పుట్టపర్తి ఎమ్మెల్యేల పిలుపు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ సభను విజయవంతం చేద్దామని సీఎం సభ సమన్వయకర్త, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కూటమిపార్టీ నాయకులకు, కార్య కర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌పాల్గొనే సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ సభను విజయవంతం చేయడంలో భాగంగా కూటమి పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే సూపర్‌సిక్స్ పథకాలను సూపర్‌హిట్‌గా అమలు చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపే విధంగా అనంతలో జరిగే సభను విజయవంతం చేయాలన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ వెన్నులో వణుకు పుట్టేలా భారీస్థాయిలో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. గత వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం వలన రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలకిచ్చిన హామీలను, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో అన్ని స్థానాలను కూటమి అభ్యర్థులే గెలిచేలా పనిచేయాలన్నారు. సభానంతరం తణుకు ఎమ్మెల్యేకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి బాబా చిత్రపటాన్ని, మెమెంటోను అందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకర్, ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరన్, రాష్ట్ర డైరెక్టర్లు కాలేనాయక్, యశోద, శ్రీనివాసులు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్లు రామాంజినేయులు, విజయ్‌కుమార్, జయచంద్ర, ఒలిపి శ్రీనివాసులు, మల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మైలేశంకర్, మాజీ జడ్పీటీసీ చెన్నకేశవులు, బీజేపీ నాయకులు కొండమరాజు, కళ్యాణ్ కుమార్, జ్యోతిప్రసాద్, సుదర్శన్, ఉత్తమ్‌రెడ్డి, సురేంద్రబాబు, బాలగంగా ధర్, జనసేన నాయకులు సతీష్, అబ్దుల్, సింగిల్ విండో అధ్యక్షులు, సభ్యులు, సాగునీటి సంఘం పాలకవర్గ సభ్యులు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో మరింత భారం

● వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన



పుట్టపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

పుట్టపర్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమపై మరింత భారం మోపుతోందని వార్డు సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మున్సిపల్ పరిధిలోని వార్డు సచివాలయ ఉద్యోగులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. సచివాలయ ఉద్యోగసంఘం నాయకులు సురేంద్రరెడ్డి, మోహన్, నరసింహ, లావణ్య, సురేశ్ మాట్లాడుతూ... గతంలో వలంటీర్ నిర్వహించే మ్యాప్ విధులను సచివాలయ ఉద్యోగులతో చేయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

● బత్తలపల్లి : పలు సర్వేలు చేయిస్తూ ప్రభుత్వం తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జేఏసీ నాయకులు శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఎంపీడీఓ నరసింహనాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, మారుతి, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌లో మూడు జట్ల విజయం

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేజ స్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగాయి. శనివారం మొదటి మ్యాచ్‌లో సేవ్‌ఫార్మర్స్ జట్టు పై స్టార్ లెవెన్స్ జట్టు 66పరుగులతో విజయం సాధించింది. రెండోమ్యాచ్‌లో మైట్ వారియర్స్ జట్టు గణేష్ ఫ్రెండ్స్ లెవెన్స్‌పై 10పరుగుల తేడాతో గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో కొత్తచెరువు ఇండియన్ లెవెన్స్ సీనియర్ జట్టుపై లక్ష్మీనరసింహ లెవెన్స్ జట్టు 77పరుగులు, 7వికెట్ల తేడాతో గెలిచింది. మ్యాచ్‌లలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్న బాబ్జాన్, శ్రీకాంత్, చిరుకు బీజేపీ నాయకులు తదితరులు షీల్డులు అందజేశారు.

సూపర్ హిట్ చేద్దాం: సందిరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు

ధర్మవరం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 10న నిర్వహించే సూపర్‌సిక్స్ - సూపర్‌హిట్ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపు నిచ్చారు. ఆయన శనివారం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సందిరెడ్డి మాట్లాడుతూ...గత 15నెలలుగా రాష్ట్ర ప్రజలు ఈ ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వంగా కొనియాడుతున్నారన్నారు. ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించిన హామీలనే కాకుండా ప్రతి కేబినేట్ సమావేశం తరువాత ప్రజలకు కొత్త పథకాలను అందిస్తూ పాలనలో కొత్త చరిత్రను సృష్టిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని తీవ్రంగా వెనక్కి నెడుతూ ప్రజలను అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సహకారం, అలాగే కేంద్ర ప్రభుత్వం మద్దతుతో సూపర్‌సిక్స్ పథకాలు రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. అనంతరం జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంతో పేద, మ ,ధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజ్ఞతగా వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, రూరల్ అధ్యక్షుడు గొట్లూరుచంద్ర, జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి, నాయకులు నబీరసూల్, పామిశెట్టి శివశంకర్, భక్తవత్సలం, పోతుకుంట రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం ఏపీడీగా కేవీ చలపతి

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డ్వామా ధర్మవరం ఏపీడీగా కేవీ చలపతిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశి భూషణ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపు రం, శ్రీసత్యసాయి జిల్లాల ఏపీడీగా పని చేస్తున్న ఆయనను వెనక్కి తీసుకుని ధర్మవరం ఏపీడీగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

వేతన బకాయిలు చెల్లించాలి

మండల సమావేశాన్ని అడ్డుకున్న పారిశుధ్య కార్మికులు



మండల సమావేశాన్ని అడ్డుకుంటున్న కార్మికులు

గాండ్లపెంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమకు వేతన బకాయిలను పూర్తి స్థాయిలో చెల్లించాలంటూ చెత్త సేకరణ పారిశుధ్య కార్మికులు మండల సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకున్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పని తీరు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. మండలంలో పలువురు కూలీలకు ఉపాధి బిల్లులు అందలేదని, ట్రాన్స్‌కో ఏఈ అందుబాటులో లేరని, విద్యుత్ సమస్యలపై రైతులు ఇబ్బందులు పడుతున్నారనే పలు అంశాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా తమకు జీతాలు చెల్లంచలేదని చెత్త కార్మికులు సమావేశాన్ని అడ్డుకున్నారు. గతంలో పెండింగ్ ఉన్న జీతాలను ఇటీవల విడుదలైన నిధుల నుంచి పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేశారు. గంటపాటు పలు నినాదాలతో సమావేశాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి వారితో మాట్లాడుతూ... చెత్త సేకరణ కార్మికుల జీతాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలుపడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సమావేశంలో ఈఓఆర్డీ సునీత, ఎంఈఓ క్రిష్ణానాయక్, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ జయరామిక్రిష్ణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు రామాంజులరెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు తదితర స్థానిక ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



నల్లచెరువు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల అభిషేకాల అనంతరం విశేష అలంకరణతో పాటు ఆకుపూజ, అర్చనలు చేశారు. ఆలయం భక్తులతో కిటకటలాడింది. దాతల విరాళాలతో ఆలయంలో అన్నదానం చేశారు.

యూరియా పంపిణీ



గాండ్లపెంటలో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

గాండ్లపెంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మల్లమీదపల్లి రైతు సేవా కేంద్రాంలో యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి షాదాబ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మల్లమీదపల్లి పంచాయతీలో వరి పంట సాగచేసిన రైతుల కోసం 6.3 టన్నుల (140 బస్తాలు) యూరియా రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉందని, కావలసిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం తెచ్చి తీసుకెళ్లాలన్నారు. అలాగే పలు ఎరువుల దుకాణాలను తహసీల్దార్ బాబురావు, వ్యవసాయా ధికారులు తనిఖీ చేశామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, ఈశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

టోకెన్ పద్ధతిలో పంపిణీ : ఏఓ

● నల్లమాడ: మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులకు టోకెన్ పద్ధతిలో యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ మహమ్మద్ హక్ తెలిపారు. యూరియా కావలసిన రైతులకు టోకెన్ పద్ధతిలో అందజేస్తామన్నారు. ముఖ్యంగా వరి, మొక్క జొన్న సాగుచేసిన రైతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అలాగే యూరియా నిల్వ ఉన్న గదిని తహసీల్దార్ రంగనాయకులు పరిశీలించారు. ఈ పంపిణీలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

● నంబులపూలకుంట: మండలంలోని ఎరువుల దుకాణదారులు లైసెన్సు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏఎస్ఐ కిషోర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు రైతులకు అందించా లన్నారు. యూరియా నిల్వలను పరిశీలించారు. వారితో పాటు వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో పాటు దుకాణదారులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

● రేపు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన
: సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు చెప్పి, అధికారంలోకి వచ్చాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిచేయి చూపాన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా పంపిణీలో ప్రభుత్వ వైఫల్యాలపై సోమవారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

సమన్వయ సమావేశం నిర్వహించరా?

● ఏపీటీఎఫ్ నాయకులు


కొత్తచెరువు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశాన్ని ఆర్నెల్లు అయినా జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహించకపోవడం ఏమిటని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్ర ప్రశ్నించారు. ఈ మేరకు వారు శనివారం విద్యాశాఖ ఏడీ శ్రీనివాసరావును స్థానిక డీఈఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించి, ఉపాధ్యాయుల సమస్యలు, వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, విద్యావ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించాల్సి ఉందన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కటారుపల్లిలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గాండ్లపెంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాల, ఆదర్శ ప్రయివేటు పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను హెచ్ఎం సురేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. సర్వేపల్లి రాధక్రిష్ణ గురించి వివరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఆదర్శ పాఠశాలలోనూ ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం మల్లికార్జున, మహేష్, కటారుపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు షంషేర్, మాధవి, ప్రమీల, భారతి, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.



కమ్మగుట్టపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంబులపూలకుంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పునడింపల్లి కాంప్లెక్సు పరిధిలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మగుట్టపల్లి ప్రాథమిక పాఠశాలలో, ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి దుశ్శాలువ, పూల మాలతో సత్కరించారు. జౌకల గ్రామ పాఠశాలలో పనిచేస్తున్న కమలమ్మ, గంగినాయవారిపల్లి వీరారెడ్డి, కమ్మగుట్టపల్లి మదన్ ప్రతాప్, గౌకనపేట టోపీ వలీని సన్మానించారు. ఉపాధ్యాయులు మురళి, సురేంద్ర, మహేష్, రమేష్, ఓబులపతి, మోహన్ కుమార్, రాణాప్రతాప్, మహేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గురువులకు సన్మానం



సన్మాన గ్రహీతలతో ఉపాధ్యాయ సంఘం నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులు అందుకున్న గురువులకు శనివారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో అవార్డు పొందిన విజయరాణి, షమీంతాజ్, విజయభార్గవి, కేశవమూర్తి, నాగరాజు, నందిని, పాండు, ఎంఈఓ గంగప్ప, ప్రసన్నలక్ష్మిలను సత్కరించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు నారాయణస్వామి, బాబు, చెన్నకేశవులు, గోపాల్, బాలనారాయణస్వామి, నాగమణి, లీలావతి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు..



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

పరిగి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారికి ఎంఈఓ శేషాచలం ఆధ్వర్యంలో శనివారం స్థానిక వెలుగు కార్యాలయం మీటింగ్‌హాల్‌లో సన్మానసభ నిర్వహించారు. ఏడాదిపాటు విద్యార్థులకు బోధనతోపాటు వివిధ రంగాల్లో నైపుణ్యం చాటుకునే విధంగా పాఠాలు నేర్పిన శీగుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చలపతి ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. మండల ఉపాధ్యాయ బృందం అతనికి శాలువకప్పి సన్మానించింది. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహంతేష్, పరిగి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కృపాసత్యరాజ్ ఆధ్వర్యంలో 12మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం జ్యోతిర్మయి, రఘునందన్, రామక్రిష్ణ, గణేష్, ప్రకాశ్, శంకరప్ప పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

గుడిబండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. సర్వేపల్లి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ తాత్కాలిక కార్యాలయం ప్రారంభం

సోమందేపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న సచివాలయ భవనంలో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయ తాత్కాలిక భవనాన్ని మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణ ప్రారంభించారు. సీడీపీఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ గతంలో ప్రాజెక్ట్ ఆఫీస్, జాతీయరహదారి అవతలవైపు ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలిగేదన్నారు. నాయకులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లగా తాత్కాలికంగా పట్టణంలో కార్యాలయం ఏర్పాటుకు సహకరించారన్నారు. ఎంపీడీఓ వెంకటలక్ష్మి, అంగనవాడీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మారుతి(ఫైల్)

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో పుట్టపర్తికి వెళ్లే యూటర్న్ వద్ద 44వ జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ మారుతి(29) మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. కియ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపిన మేరకు చిన్నపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశులు, నాగసుబ్బమ్మ దంపతుల కుమారుడు బోయ మారుతి సెంట్రింగ్ పనులు చేసేవాడు. శుక్రవారం బోయమారుతి, స్నేహితుడు అమ్మవారిపల్లికి చెందిన అంజి పనినిమిత్తం కొత్తచెరువుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జాతీయరహదారిపై వెంకటరెడ్డిపల్లి సమీపంలో యూటర్న్ తిసుకుంటుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్లే కారు ఢీకొట్టింది. ప్రమాదంలో మారుతి అక్కడికక్కడే మృతిచెందగా అంజి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన అంజిని ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

హిందూపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అత్యాచారయత్నానికి పాల్పడిన అన్రూద్‌అలీని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. హిందూపురం పట్టణం కొట్నూరులో ఉత్తర ప్రాంతానికి చెందిన అన్రూద్‌అలీ ఓ మహిళను బిడ్డతో సహా తీసుకువచ్చి ఏడేళ్ల నుంచి నివాసముంటున్నాడు. శుక్రవారం 13ఏళ్ల బాలికపై అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. బాలిక తప్పించుకుని తల్లికి సమాచారం ఇచ్చింది. తల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడిని శనివారం అరెస్ట్‌చేసినట్లు సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాల సీజ్

సోమందేపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని హిందూపురం నుంచి పెనుకొండవైపు వెళ్తూ సోమందేపల్లి జాతీయరహదారిపైబ బైక్ రేసింగ్ చేస్తున్న పది మందిని అదుపులోకి తీసుకుని బైక్‌లు సీజ్‌చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఒక్కో వాహనానికి రూ.1000 జరిమానా విధించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.

స్థల వివాదంపై పోలీసులకు ఫిర్యాదు

సోమందేపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీలో స్థల వివాదంపై ఇరువర్గాల మధ్య శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. రెండు వర్గాలు స్థలం తమదంటే తమదని గొడవకు దిగినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించినట్లు తెలిపారు. వారివద్ద భూమికి సంబంధించి ఆధారాలు తేవాలని కోరామన్నారు. వాటిని పరిశీలించి సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీనిపై తహసీల్దార్ మారుతిరెడ్డిని వివరణ కోరగా సమస్య తమదృష్టికి రాలేదన్నారు. గతంలో ఆలయ నిర్మాణానికి 15సెంట్లు స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. మరొకరివద్ద ఏమి ఆధారాలున్నాయో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

బై బై .. గణేశా..!

● ముగిసిన వినాయక విగ్రహాల నిమజ్జనం



గుడ్డం కోనేరులో చివరగా నిమజ్జనం అవుతున్న గరిడి వినాయకుడు

హిందూపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ప్రతియేడాదిలాగే ఈసారికూడా మూడోరోజు సాయంత్రానికి వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ముగిసింది. వినాయక చవితి పండగను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన విగ్రహాలను 9వ రోజు గురువారం మధ్యాహ్నం మండపాల నుంచి తరలించారు. కానీ అవి గుడ్డం కోనేరువద్దకు చేరుకుని పూర్తయ్యేసరికి శనివారం సాయంత్రం అయింది. ఆఖరిరోజు ఉదయం నుంచి ఆరు విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేశారు. ఆనవాయితీ ప్రకారం ఆఖరులో గరిడి వినాయక, అంతకుముందు కట్టకింద మహాగణపతి, ఆది జాంబవంతుడు, అంబేడ్కర్‌నగర్ వినాయకుడు, ముక్కడిపేట యువసేన వినాయకులు నిమజ్జనం చేశారు. పెద్ద విగ్రహాల నిమజ్జనం చూడటానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. అయితే మూడోరోజుకూడా నిమజ్జనం కొనసాగడంతో పోలీసులు నిర్వాహకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ముఖ్యఅధికారులు పాల్గొనలేదు. గతంలో ఆఖరి విగ్రహం నిమజ్జనం సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖ, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక శాఖాధికారులు పాల్గొనేవారు. ఈసారి అధికారులు మండప నిర్వాహకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ పాల్గొనలేదు.

వైభవంగా వినాయక నిమజ్జనం

మడకశిర టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం రాత్రి వినాయక నిమజ్జన యువత కేరింతల నడుమ వైభవంగా సాగింది. సాయినగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనంలో శివ పార్వతులతో పాటు, బసవన్న వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మారుతీనగర్, సదాశివాపురం, సాయినగర్, ఎన్‌టీఆర్ సర్కిల్, సదాశివపురం, వాల్మీకి సర్కిల్, శివాపురంతో పాటు దాదాపు 14 చోట్ల వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యువత ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. తలల వినాయకుడు, ప్రతి వినాయకుని వద్ద డీజేలను ఏర్పాటు చేసి అందుకు అనుగుణంగా నృత్యాలు చేశారు.. మహిళలు, యువత, చిన్నారులు సైతం ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను మారుతీనగర్, మదుగిరి సర్కిల్‌తో పాటు పలు ప్రాంతాల్లో నిలిపివేశారు.



యువత కేరింతల నడుమ సాగుతున్న గణేశుడు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బాలాసాయి వినాయకుడు

నాన్న ఆశీర్వాదాలే నాకు శ్రీరామరక్ష : మంత్రి సవిత



తండ్రి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నాన్న ఆశీర్వాదాలే శ్రీరామరక్ష అని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. మండలంలోని రాంపురం పంచాయతీలో మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి 82వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి కుటుంబ సభ్యులతో రామచంద్రారెడ్డి ఘాట్‌వద్దకు చేరుకుని సమాధికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. మంత్రి విలేకరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి జ్ఞాపకాలను నెమరువేసుకుని కన్నీరు పెట్టుకున్నారు. తండ్రి, స్నేహితులు తనకెంతో నేర్పారని పేదవారికి సహాయ సహకారాలు అందించే గుణం వారి నుంచే వచ్చిందన్నారు. ఎమ్మెల్యే కావడం నా కలఅన్నారు. 2009నుంచి రాజకీయ అరంగేట్రం చేసి ఎమ్మెల్యే సీటుకోసం కష్టపడ్డానన్నారు. ఇప్పటికి కలనెరవేరిందన్నారు. ఎస్ఆర్ఆర్ చారిటుబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో రామచంద్రారెడ్డి కాంస్యవిగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రాంపురం పంచాయతీ నాలుగు గ్రామాల్లో చీరలు, గృహోపకరణాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

సూపర్‌హిట్ సభను విజయవంతం చేద్దాం: సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ బహిరంగ సభను విజయవంతం చేద్దామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు, మంత్రి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 10న అనంతపురంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామని, సభకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, తదితర ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగారురాజు, కేశవయ్య, రఘువీరచౌదరి, సిద్దయ్య, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, రమణమ్మ, చంద్రకాంతమ్మ పాల్గొన్నారు.

మంత్రి సవితకు అండగా ఉంటాం

పెనుకొండ టౌన్: ప్రాణమున్నంతవరకు వడ్డెర కులస్థులు మంత్రి సవితకు అండగా ఉంటామని వడ్డెర సాధికార సమితి మీడియా కోఆర్డినేటర్ పల్లపు మహేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వడ్డె వెంకట్, పలువురు నాయకుల ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. కడప రామాంజి, రవిమోహన్, అమర్నాథ్, నిడిమామిడప్ప, సర్పంచ్ వినోద్‌కుమార్, వడ్డెశ్రీనివాస్, వెంకటరమణప్ప, రవికుమార్, లక్ష్మీనారాయణ, సాయిప్రసాద్, రఘు, హనుమప్ప, పల్లె బాలకృష్ణ, గంగాధరప్ప, సోమశేఖర్, నాగరాజు పాల్గొన్నారు.



మంత్రి సవితను సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం

చిలమత్తూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు న్యాయం జరుగుతుందని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన శ్రీదేవి అన్నారు. పార్టీ కోసం పనిచేస్తున్న తనను గుర్తించిన ఎమ్మెల్యే బాలకృష్ణ, పార్టీ అధిష్ఠానం వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిందన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యేకు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించి న్యాయం చేస్తోందన్నారు. మహిళగా తనకు రాజకీయ అవకాశం కల్పించిన పార్టీకి రుణపడి ఉంటానన్నారు.

సూపర్‌హిట్‌ను విజయవంతం చేయండి

అగళి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ మధూడి తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. 10వ తేదీన అనంతపురం జిల్లాకేంద్రంలో జరిగే సూపర్‌హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఒకటి, రెండు వాహనాల్లో తరలి రావాలని పిలుపునిచ్చారు.

9న 5కే రెడ్ రన్

హిందూపురం,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాలతో 9వ తేదీన హిందూపురంలో డిగ్రీ విద్యార్థులకు మారథాన్ 5కే రెడ్ రన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. 17-25ఏళ్ల వయసున్న విద్యార్థులు ఏదైనా కళాశాలలో డిగ్రీ చదువుతుండాలన్నారు. గత ఏడాది రెడ్‌రిబ్బన్ మారథాన్‌లో పాల్గొని గెలుపొందిన వారికి అవకాశం లేదన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 9న ఉదయం 5.30కు హిందూపురం మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాలన్నారు. ఉదయం 6-30 వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందన్నారు. అనంతరం మారథాన్ పరుగు పందెం ప్రారంభం అవుతుందన్నారు. 5 కి.మీ పందెంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ విభాగాల్లో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో మొదటి, రెండో విభాగం ఉంటుందన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.7వేలు అందిస్తామన్నారు. ఇక్కడ గెలుపొందినవారు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

గుడిబండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేఎన్ పల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో శనివారం 280 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. యూరియాను తహసీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో అర్హులైన అందజేశామన్నారు.

పెనుకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూరియాను రైతులకు పెనుకొండలో సజావుగా పంపిణీ చేశారు. శనివారం వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమక్షంలో యూరియాను రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. సోమవారం నుంచి ఆయా గ్రామ పంచాయతీల్లోని రైతు సేవాకేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందని ఏఓ చందన తెలిపారు.

9న అన్నదాత పోరు కార్యక్రమం

మడకశిర టౌన్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 9వ తేదీన ఆర్డీఓ కార్యాలయం ఎదుట అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయ అవరణలో పార్టీ నాయకులతో కలసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జి.రంగేగౌడ్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

లేపాక్షి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పులమతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 200మంది విద్యార్థులకు శనివారం కంటి వైద్య నిపుణుడు సుబ్బారావు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 17మంది విద్యార్థులకు కంటిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి ప్రభుత్వం ద్వారా కంటి అద్దాలను త్వరలోనే అందజేస్తామన్నారు.

నేడు ఆలయాల మూసివేత

మడకశిర రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని భక్తరహళ్ళి నరసంహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేస్తున్నట్లు దేవదాయ శాఖ ఈఓ నరసింహరాజు శనివారం తెలిపారు. సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు స్వామివారికి సంప్రోక్షణ అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయం గమనించాలని కోరారు.

జగన్ త్వరలో జైలుకెళ్లడం ఖాయం

● ఎమ్మెల్సీ బీటీ నాయుడు

హిందూపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి మేం అధికారంలోకి వచ్చాక సప్తసముద్రాల అవతలున్నా టీడీపీ నాయకులను, అధికారులను లాక్కొస్తానని పగటికలలు కంటున్నారని ఎమ్మెల్సీ బీటీ నాయుడు మండిపడ్డారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయంవద్ద సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, నియోజకవర్గం నుంచి 10వేల మంది 10వ తేదీన అనంతపురానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. అందుకు తగ్గట్టుగా నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు. త్వరలో జగన్ జైలుకెళ్లడం ఖాయమని, ఈసారి 16ఏళ్ల జైలులోనే ఉంటారన్నారు. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన నాయకులు జైలుకు క్యూ కడుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో 11సీట్లు వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో అవికూడా రావన్నారు. చంద్రబాబును అన్యాయంగా అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అయినా మొక్కవోని దీక్షతో ఆయన బయటకు వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లో ఇచ్చిన హామీలకంటే అధికంగా నెరవేర్చారన్నారు. ఓవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. చెప్పినమాట నిలబెట్టుకున్నందుకే సూపర్‌సిక్స్, సూపర్‌హిట్ సభ నిర్వహిస్తున్నారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ ఛైర్మన్ రమేష్, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, మండల కన్వీనర్లు ప్రెస్ వెంకటేశ్, హెచ్ఎన్ రాము, శ్రీనివాసులు, అభిలాష్, దేమకేతేపల్లి అంజినప్ప, పరిశీలకుడు రజాక్, నాయకులు అంజినప్ప, రామాంజినమ్మ, ఎస్టీ సెల్ వెంకటరమణమ్మ, మంజునాథ్, నెట్టప్ప, అమర్నాథ్, రామాంజి, నవీన్, నాగేంద్ర, డైమండ్‌బాబా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు

కోలాహలంగా..



నిమజ్జనానికి తరలుతున్న గరుడ వినాయకుడు

రొద్దం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 11రోజులపాటు జరిగిన పూజల అనంతరం వినాయక విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా సాగింది. శనివారం మధ్యాహ్నం నుంచి 15వినాయక విగ్రహాలు నిమజ్జనం కోసం ట్రాక్టర్ల ద్వారా తరలించారు. పురవీధుల గుండా డీజేలతో మహిళలు, యువకులు కేరింతలు, డ్యాన్స్‌లు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. చావిడి నుంచి కెనరాబ్యాంక్ మీదుగా చిన్నయ్య టీకొట్టు సర్కిల్‌మీదుగా వైఎస్ఆర్‌సర్కిల్, బోయవీధి, పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు మధ్యాహ్నం 3 గంటల నుంచే నిమజ్జనానికి ఆటంకం కలగకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఎస్ఐ నరేంద్ర, సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు. పెద్దకోడిపల్లి గ్రామంలోని పెద్దచెరువు వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. రొద్దం జామియా మసీదు ఆధ్వర్యంలో 40కిలోల కేసరీబాత్‌ను భక్తులకు పంపిణీ చేశారు.



జనసందోహం నడుమ కదులుతున్న వినాయకుడు

ఘనంగా శోభా యాత్ర



గణపతి శోభాయాత్రలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

అమరాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో వరసిద్ధి వినాయక యువ సంఘం ఏర్పాటుచేసిన మహారాజ గణపతి శోభా యాత్ర శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుండుమల తిప్పేస్వామి పాల్గొని జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ ఇషాక్‌బాషా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, కృష్ణమూర్తి, గణేష్, శివరుద్రప్ప, మారుతిప్రసాద్, నవీన్, దాదాపీర్, చంద్రశేఖర్, తిప్పేస్వామి, హనుమంతు, రఘు, రామిరెడ్డి, ధనుంజయ, నిరంజన్, శ్రీనివాస్, చంద్రప్ప పాల్గొన్నారు.

రూ.1.10 లక్షలకు లడ్డూ వేలం



అరుణ్‌రెడ్డికి 25 కిలోల లడ్డూను అందిస్తున్న వినాయక సేవాసమితి సభ్యులు

రొద్దం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 21అడుగుల వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో వేసిన లడ్డూ వేలంపాటను రూ.1,10,116కు శేషాపురం గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు పీవీ అరుణ్‌రెడ్డి దక్కించుకున్నారు. శనివారం విగ్రహంవద్ద జరిగిన వేలంపాటలో అనేక మంది పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన వేలంపాటలో 25కేజీల లడ్డూను అరుణ్‌రెడ్డి దక్కించుకున్నారు. సమితి సభ్యులు అరుణ్‌రెడ్డికి సన్మానం చేసి లడ్డూను అందించారు. అలాగే వినాయకుని పూలహారాన్ని రొద్దం గ్రామానికి చెందిన లింగమయ్య రూ.4,600కు దక్కించుకున్నారు. టీడీపీ నాయకుడు కొట్టాల నారప్ప, లక్ష్మీనారాయణగుప్త, సభ్యులు వేణుగోపాల్, పవన్, రవి, తిప్పేస్వామి పాల్గొన్నారు.


మహిళా చట్టాలపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అవగాహన అవసరమని దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షులు లక్ష్మమ్మ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఉచిత న్యాయసేవా సదస్సును నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ సీఈఓ కవిత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. దుర్గాశక్తి సొసైటీ సోమందేపల్లి మండలంలో 9169మంది సభ్యత్వంతో ముందుకు తీసుకెళ్లడం హర్షించదగ్గ విషయమన్నారు. మహిళలు చట్టాలను తెలుసుకుని కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రోగ్రాం అసోసియేట్ రవళి, మహాశక్తి సీఈఓ రమీజా, సీఈఓ కాంచన పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



పాఠశాలకు క్రీడాసామగ్రి అందిస్తున్న జిలాన్‌బాషా, షఫీ

గోరంట్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు ఉన్నతపాఠశాలలో విద్యార్థులకోసం అదే గ్రామానికి చెందిన మహమ్మద్‌షఫీ క్రీడా సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకుడు మాజీ ఎంపీటీసీ జిలాన్‌బాషా కుమారుడు షఫీ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తండ్రికొడుకులు ఇరువురు పాఠశాల విద్యార్థులకు రెండు క్రికెట్ కిట్లు, నాలుగు షెటిల్ బ్యాట్లు, త్రోబాల్, వాలీబాల్‌లను పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డికి అందజేశారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ ఛైర్మన్ రామాంజనేయులు, ఈశ్వరమ్మ, లక్ష్మీనారాయణ, జిలాన్ బాషా పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ పాఠశాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంఈఓ-2

పరిగి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభను తెలుసుకునేందుకు తహసీల్దార్ హసీనా సుల్తానా ఏపీఆర్ఎస్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. శనివారం పదోతరగతి చదువుతున్న విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తుచేశారు. మీరుకూడా బాగా చదువుకుని వచ్చే పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఎంఈఓ-2 శేషాచలం, ప్రిన్సిపాల్ మత్స్యరాజు, ఆర్ఐ సిద్దేశ్, డిప్యూటీ ఎంపీడీఓ విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి అరుణ పాల్గొన్నారు .